మేమంతా జగన్ కోసం.!

• కొంపల్లిలో యాదవ కులస్తులతో ఆత్మీయ సమ్మేళనం • హాజరైన ముమ్మిడివరం వైఎస్సార్‌సీపీ నేతలు


కొంపల్లిలో యాదవ కులస్తులతో సమావేశమైన ముమ్మిడివరం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నేతలు

కుత్బుల్లాపూర్: 'మేమంతా జగన్ కోసం'అంటూ ప్రజలు ముక్తకంఠంతో నినదిస్తున్నారు. జెండాల కోసం జత కడుతున్న ప్రతిపక్షాలను పాతాళానికి తొక్కడమే తమ ఎజెండాగా పెట్టుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తూ దేశానికే రాష్ట్రాన్ని దిక్సూచిగా నిలిపిన జగనన్న పాలన మరోసారి రావాలని ఆకాక్షిస్తున్నారు. కుట్రలు, కుయుక్తులు, కుతంత్రాలకు నెలవైన టీడీపీ, దాని మిత్రపక్షం బీజేపీ, జనసేనలతో పాటు ఎల్లో మీడియా అసత్య ప్రచారాలను ఎండగడుతూ వైఎస్సార్‌సీపీ నేతలు స్వయంగా ప్రజలను కలిసి నిజానిజాలను బహిర్గతం చేస్తున్నారు.

◆ ఏకంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై దాడులకు తెగపడుతూ అంతమొందించేందుకు టీడీపీ చేసిన కుట్రను వివరిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ముమ్మిడివరం నియోజకవర్గం ప్రజలు కొంపల్లిలో అధికంగా ఉన్నారు. ఈ నేపథ్యంలో సదరు నియోజకవర్గం ఐ.పోలవరం మండలం జె.మూలపొలం పంచాయతీ యర్రగరువు గ్రామ యాదవ కులస్తులు ఇక్కడ అధికంగా నివసిస్తున్నారు. దీంతో ఆ గ్రామ సర్పంచ్ విజయలక్ష్మి, భైరవస్వామి, కటమ కోయలక్ష్మి, సత్తిరాజు, రాష్ట్ర డైరెక్టర్ దండవోలు వెంకటరమణ, సొసైటీ డైరెక్టర్ గంగుల శ్రీను, గంగుల వెంకటేశ్వర్లు, మందపాటి నాగబాబులు కొంపల్లిలోని ఓటర్లతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు.

◆ ఐదేళ్ల కాలంలో సీఎం జగన్ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. మరో మారు జగన్ సారథ్యంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే పేదల బతుకులు బాగుపడతాయని అన్నారు. పేదలకు, పెత్తందారులకు మధ్య జరిగే యుద్ధంలో ప్రజలు గెలవాలంటే ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. దీంతో ఇక్కడి ప్రజలు రానున్న ఎన్నికల్లో తమ సంపూర్ణ మద్దతు జగన్‌కే అంటూ ప్రతిజ్ఞ చేశారు.

బీఆర్‌ఎస్‌కు షాకుల మీద షాకులు!

త్వరలో కాంగ్రెస్‌లో చేరనున్న కుత్బుల్లాపూర్ గులాబీ నేతలు


మల్కాజిగిరి కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునీతామహేందర్‌రెడ్డితో బీఆర్‌ఎస్ మాజీ నేతలు

జగద్గిరిగుట్ట: కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ పార్టీకి షాక్‌ల మీద షాక్‌లు తగులుతున్నాయి. ఇటీవల నిజాంపేట మేయర్ కొలన్ నీలారెడ్డితో పాటు కార్పొరేటర్లు, నాయకులు కాంగ్రెస్‌లో చేరిన విషయం విదితమే. తాజాగా 4రోజుల క్రితం జీహెచ్‌ఎంసీకి చెందిన పలువురు నాయకులు బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేశారు. మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్లు లక్ష్మారెడ్డి, జయరాం, మాజీ కౌన్సిలర్, గతంలో కార్పొరేటర్‌గా పోటీ చేసిన వి.కృష్ణగౌడ్, మాజీ కో–ఆప్షన్ సభ్యుడు సయ్యద్ రషీద్, రషీద్ బేగ్, మువ్వ రవి కిరణ్‌లు ఇటీవల విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ప్రస్తుతం వారందరూ స్తబ్దుగా ఉన్నారు. దీంతో కాంగ్రెస్ పార్టీ మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి పట్నం సునీతామహేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్, నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డిలు సోమవారం వీరితో సంప్రదింపులు జరిపారు. కాంగ్రెస్ పార్టీలోకి రావాలని ఆహ్వానించగా వారు సానుకూలంగా స్పందించారు. మరో రెండు, మూడు రోజుల్లో సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో వీరంతా కాంగ్రెస్‌లో చేరే అవకాశం ఉంది.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన


రోగి వివరాల తెలుసుకుంటున్న వైద్యుడు చంద్రశేఖర్

చింతల్: ఐడీపీఎల్‌లోని అలవి ఆస్పత్రిలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం వరకు కొనసాగిన శిబిరంలో జనరల్ ఫిజీషియన్, డాక్టర్ చంద్రశేఖర్, పీడియాట్రిషియన్ డాక్టర్ ప్రదీప్‌రెడ్డి, స్త్రీ, ప్రసూతి వైద్యురాలు కల్యాణి, డాక్టర్ శ్రీనివాస్ రావులు రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. రక్తపరీక్షలతో పాటు లివర్‌కు సంబంధించి ఫైబ్రో స్కాన్ పరీక్షలు నిర్వహించి సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ శిబిరంలో ఆస్పత్రి సిబ్బంది, పారామెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మహా కుంభాభిషేకం


మహా కుంభాభిషేకంలో పాల్గొన్న మల్కాజ్‌గిరి ఎంపీ అభ్యర్థి సునీతామహేందర్‌రెడ్డి, మేయర్ నీలారెడ్డి

నిజాంపేట్: బాచుపల్లి కౌసల్య కాలనీలోని శ్రీసీతారామాంజనేయ, శ్రీదేవి భూదేవి సహిత వేంకటేశ్వర, శివపంచాయతన, శ్రీలలితా పరమేశ్వరి ఆలయంలో సోమవారం నవగ్రహ ప్రతిష్ఠ, మహాకుంబాభిషేక మహోత్సవం ఘనంగా జరిగింది. ఆలయ చైర్మన్, కార్పొరేటర్ ఆగం రాజుముదిరాజ్ ఆధ్వర్యంలో జరిగిన పూజా కార్యక్రమాల్లో మల్కాజ్‌గిరి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి సునీత మహేందర్‌రెడ్డి, మేయర్ నీలారెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి భూపతిరెడ్డి, కో.ఆర్డినేటర్ శోభారాణి లు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ఆగం పాండు, చిట్ల దివాకర్, ఇంద్రజీత్‌రెడ్డి, ఏనుగుల శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు ఆవుల జగన్‌యాదవ్, నాగరాజ్‌యాదవ్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

అధికారాన్ని కుటుంబం కోసం వాడొద్దు

• వాడితే కేసీఆర్‌కు పట్టిన గతే పడుతుంది • ప్రచారంలో మల్కాజ్‌గిరి లోక్‌సభ అభ్యర్థి ఈటల రాజేందర్

నిజాంపేట్: దేశం అభివృద్ధి పథంలో పయనించాలంటే మరోమారు బీజేపీని గెలిపించాలని మల్కాజ్‌గిరి లోక్‌సభ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. సోమవారం ప్రగతినగర్‌లో జరిగిన కార్యక్రమంలో పలువురు బీజేపీలో చేరగా ఆయన పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ... ప్రజాప్రతినిధులు ప్రజాసేవ పరమావధిగా పని చేయాలన్నారు. అధికారాన్ని కుటుంబం కోసం వాడితే కేసీఆర్‌కు పట్టిన గతే పడుతుందని విమర్శించారు. పదేళ్ల బీఆఎస్ పాలనలో రాష్ట్రం అప్పులు ఊబిలో కూరుకుపోయిందని ఆరోపించారు. అనేక స్కామ్‌లు బహిర్గమయ్యాయని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్‌ఎస్ దారిలోనే నడుస్తోందని విమర్శించారు.

◆ మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన ఆ పార్టీ వంద రోజుల పాలనలో రాష్ట్ర ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. మల్కాజ్‌గిరి ఎంపీగా తనను గెలిపిస్తే కేంద్ర ప్రభుత్వం నుంచి కుత్బుల్లాపూర్ అభివృద్ధికి మరిన్ని నిధులు తీసుకొస్తానని హామీ ఇచ్చారు. ప్రపంచం మొత్తం నేడు ప్రధాని మోదీ జపం చేస్తోందన్నారు. భారత్‌ను ప్రపంచ శక్తిగా మార్చగలిగే సత్తా కేవలం బీజేపీకే ఉందని ధీమా వ్యక్తం చేశారు. దేశ ప్రజలు మోదీని మరోసారి ప్రధానిగా చూడాలనుకుంటున్నారని తెలిపారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో కమలం గుర్తుపై ఓటేసి అఖండ విజయాన్ని అందించాలని అభ్యర్థించారు. కార్యకర్తలు, నాయకులు కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ వైపు మొగ్గు చూపేలా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట్ కార్పొరేషన్ బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీని భారీ మెజార్టీతో గెలిపించాలి

జీడిమెట్ల: దేశంలో ప్రధాని నరేంద్ర మోదీకి, దేశ వ్యతిరేకులకు మధ్య జరుగుతున్న ఈ ఎన్నికల్లో బీజేపీని భారీ మెజార్టీతో గెలిపించాలని మేడ్చల్ జిల్లా కన్వీనర్ డా.ఎస్.మల్లారెడ్డి అన్నారు. సోమవారం ఆయన ఇంటింటికీ బీజేపీ కార్యక్రమంలో భాగంగా సుభాష్‌నగర్ డివిజన్‌లో ప్రచారం నిర్వహించారు. బీజేపీకి అత్యధిక సీట్లు ఇచ్చి దేశ ప్రగతికి ప్రజలు తోడ్పడాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గిరివర్ధన్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షులు కంది శ్రీరాములు,అండగి మల్లేష్,విజేందర్‌లు పాల్గొన్నారు.


బీజేపీలో చేరిన వారికి పార్టీ కండువాలు కప్పుతున్న ఈటల రాజేందర్


సుభాష్‌నగర్ డివిజన్‌లో ఓటర్లకు కరపత్రాలు అందజేస్తున్న మల్లారెడ్డి

దేవాలయ అభివృద్ధికి సహాయ, సహకారాలు అందిస్తా

ఎమ్మెల్యే కేపీ వివేకానంద్


చిత్తారమ్మ దేవి జాతరలో పాల్గొన్న ఎమ్మెల్యే వివేకానంద్

దుండిగల్: దేవాలయ అభివృద్ధికి తన పూర్తి సహాయ, సహకారాలు అందిస్తానని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. దుండిగల్ మున్సిపాలిటీ డి.పోచంపల్లిలో కోళ్ల వీరేశం యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చిత్తారమ్మ దేవి జాతరకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. నియోజకవర్గ ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని అమ్మవారిని కోరుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు మహేందర్ యాదవ్, సాయి యాదవ్, ప్యాక్స్ డైరెక్టర్ వెంకటేష్ యాదవ్, బిఆర్ఎస్ పార్టీ దుందిగల్ మున్సిపాలిటీ ప్రధాన కార్యదర్శి కొల్తూరి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

◆ జీడిమెట్ల డివిజన్ బీరప్ప నగర్‌లో నిర్వహిస్తున్న శ్రీబీరప్ప స్వామి కామారతి కల్యాణ మహోత్సవానికి ఎమ్మెల్యే వివేకానంద్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు నదీమ్ రాయ్, కాలే గణేష్, దేవాలయ కమిటీ చైర్మన్ నార్లకంటి నాగేష్, పెద్ద కురుమ యాదయ్య, సెల్వోజి సత్తయ్య, నార్లకంటి చంద్రయ్య, నియోజకవర్గ కురుమ సంఘం అధ్యక్షులు పాలకృష్ణ, ప్రధాన కార్యదర్శి కుంటి మల్లేష్, ప్రతాప్, ఉలిపి మల్లేష్, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

◆ కుత్బుల్లాపూర్ లోని ఎమ్మెల్యే నివాసంలో నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, దేవాలయ కమిటీ సభ్యులు, శ్రీరామ నవమి వేడుకలకు హాజరు కావాలని ఆహ్వాన పత్రికలను అందజేశారు.

సంఘ వ్యతిరేక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు


రౌడీషీటర్లతో ఇన్‌స్పెక్టర్ క్రాంతికుమార్

జగద్గిరిగుట్ట: ఎన్నికల సమయంలో అందరూ సంయమనం పాటించాలని జగద్గిరిగుట్ట ఇన్‌స్పెక్టర్ క్రాంతికుమార్ అన్నారు. పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లను పిలిచి హెచ్చరికలు జారీ చేశారు. ఎన్నికల ప్రచారంలో పాల్గొనొద్దని సూచించారు. సంఘ వ్యతిరేక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జనావాసాల మధ్య ప్లాస్టిక్ వ్యర్థాల డంప్


ప్లాస్టిక్ వ్యర్థాలతో వచ్చిన ట్రాక్టర్‌ను అడ్డుకున్న రాఘవేందర్‌గౌడ్

సుభాష్‌నగర్: జనావాసాల మధ్య ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలు వదులుతున్న వారిపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని శంకరయ్య భవానీ జీబీఎన్‌క్లేవ్ అధ్యక్షుడు రాఘవేందర్‌గౌడ్ పేర్కొన్నారు. గాజులరామారం డివిజన్ దేవేందర్‌నగర్‌లోని శంకరయ్య భవాని జీబీ ఎన్‌క్లేవ్ పరిసర ప్రాంతాల్లో గత కొన్ని నెలలుగా కూకట్‌పల్లి, ఎల్లమ్మబండ, మహాదేవపురం ప్రాంతాల నుంచి ప్లాస్టిక్, చెత్త ఇతర వ్యర్థాలను తీసుకువచ్చి ఇక్కడ డంప్ చేస్తున్నారని తెలిపారు. దీంతో స్థానికంగా ఉన్నవారు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. కొన్ని నెలల పాటు ఇక్కడ వ్యర్థాలను వదులుతుండటంతో ప్రస్తుతం చుట్టుపక్కల బోర్లలో గత ఆరు నెలల నుంచి దుర్వాసనతో కూడిన నీరు వస్తుందని తెలిపారు. సోమవారం స్థానికంగా వ్యర్థాలను పారబోస్తున్న ట్రాక్టర్ అడ్డుకుని జీహెచ్‌ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేశారు. సంబంధిత అధికారులు దృష్టి సారించి వ్యర్థాలను వదులుతున్న వాహనదారులపై చర్యలు తీసుకోవాలని రాఘవేందర్‌గౌడ్ డిమాండ్ చేశారు.

పక్కన చెత్త వేయకుండా చూడాలి


జీడిమెట్ల ప్రధాన రోడ్డులో పారబోసిన చెత్తాచెదారాలు

జీడిమెట్ల: రోడ్ల పక్కన చెత్త వేయకుండా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. సూరారం నుంచి జీడిమెట్ల డిపో వచ్చే రోడ్డులో కొంతమంది నిత్యం చెత్తను తీసుకువచ్చి నిత్యం ప్రధాన రోడ్డులో పారేస్తున్నారు. రోడ్డుపై వెళ్లే వారికి చెత్తాచెదారాల వలన తీవ్రమైన దుర్గంధం వెలువడుతుందని వాహనదారులు అంటున్నారు. రోడ్లపై చెత్త వేయకుండా చూడాల్సిన మున్సిపల్ అధికారులు ప్రధాన రోడ్డులో చెత్త వేస్తున్న మిన్నకుండిపోతున్నారు. ఇప్పటికైన మున్సిపల్ అధికారులు పట్టించుకుని ప్రధాన రోడ్డులో చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

'కాంగ్రెస్ పాలనలో ప్రజలు సుఖసంతోషాలతో ఉన్నారు'

రంగారెడ్డినగర్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గాన్ని మరింతగా అభివృద్ధి చేసుకోవడానికి లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటేయ్యాలని మల్కాజ్‌గిరి లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి సునీతా మహేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం రంగారెడ్డి నగర్, జగద్గిరిగుట్ట డివిజన్లలో సంక్షేమ సంఘాలు, కుల సంఘాలతో ఆమె ఆత్మీయ సమావేశం నిర్వహించారు. నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంతరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్, డీసీసీ అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

◆ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్రం, రాష్ట్రాల్లో కాంగ్రెస్ ప్రభుత్వాలు ఉంటే రాష్ట్రానికి మరిన్ని అభివృద్ధి నిధులు వస్తాయని అన్నారు. వంద రోజుల కాంగ్రెస్ పాలనలో ప్రజలు సుఖసంతోషాలతో ఉన్నారన్నారు. ఈ సందర్భంగా పలు కుల సంఘాలు సునీతా మహేందర్‌రెడ్డికి మద్దతు తెలుపుతూ పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ డీసీసీ అధ్యక్షుడు కె.ఎం.ప్రతాప్, శోభారాణి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు నర్సారెడ్డి భూపతిరెడ్డి, జ్యోత్స్నారెడ్డి, పున్నారెడ్డి, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఆర్.లక్ష్మి, కుత్బుల్లాపూర్ బీ–బ్లాక్ అధ్యక్షుడు బండి శ్రీనివాస్‌గౌడ్, డివిజన్ల ఇన్‌చార్జిలు, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.


కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సునీతామహేందర్‌రెడ్డికి మద్దతు పత్రాన్ని అందజేస్తున్న సంక్షేమ సంఘాల నాయకులు

గణపతి సచ్చిదానంద ఆశ్రమంలో కుంభాభిషేకం

దుండిగల్: దుండిగల్‌లోని శ్రీగణపతి సచ్చిదానందస్వామి ఆశ్రమంలో నవీకరించిన ఆలయ సముదాయ పునః ప్రతిష్ఠలో భాగంగా ప్రాణప్రతిష్ఠ, కుంభాభిషేకం సోమవారం ఘనంగా నిర్వహించారు.గణపతి సచ్చిదానంద స్వామీజీ, దత్త విజయానందతీర్థ స్వామీజీ తదితరులు పాల్గొన్నారు. వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఈ దేవతా సముదాయ క్షేత్రాన్ని సందర్శించడం ద్వారా ప్రజలు తమ కోర్కెలు తీర్చుకొని, అనుకున్న లక్ష్యాలు సాధించి శుభ ఫలితాలు పొందగలరని పేర్కొన్నారు.

మైసమ్మనగర్ ఏ-బ్లాక్ అభివృద్ధికి కృషి


బ్రహ్మనందాచారి, ముకేశ్‌ను సత్కరిస్తున్న స్థానికులు

జగద్గిరిగుట్ట: మైసమ్మనగర్ ఏ–బ్లాక్ అధ్యక్ష, కార్యదర్శులుగా బ్రహ్మనందాచారి, దార ముకేశ్‌లు ఎన్నికయ్యారు. ఆదివారం సంక్షేమ సంఘం ఎన్నికలు జరగగా 346 ఓట్లు పోలయ్యాయి. బ్రహ్మనందాచారి తన సమీప అభ్యర్థిపై 180 ఓట్ల మెజార్టీ, దార ముకేశ్ తన ప్రత్యర్థిపై 186 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. వీరిని స్థానిక ప్రజలు సత్కరించారు. బస్తీ అభివృద్ధి కోసం కృషి చేస్తామని వారు పేర్కొన్నారు.

ఎండలో సేఫ్టీ.. ఈ పోలీసు టోపీ!


ప్రత్యేక టోపీలు ధరించి విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

సుభాష్‌నగర్: నగరంలో ఎండలు మండిపోతున్నాయి. ఉక్కపోత, వడగాలులతో జనాలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. మధ్యాహ్నం వేళ బయటకు రావాలంటే జంకుతున్నారు. జనం పరిస్థితి ఇలా ఉంటే ఉదయం నుండి సాయంత్రం దాకా మండుటెండలో విధులు నిర్వర్తిస్తున్న ట్రాఫిక్ పోలీసుల పరిస్థితి మరీ దయనీయంగా మారింది. ఎండల నుంచి కొంత వరకు చెక్ పెట్టడానికి సైబరాబాద్ కమిషనర్ పరిధిలో ట్రాఫిక్ పోలీసులకు ప్రత్యేక టోపీలను పంపిణీ చేశారు. ఎండ నుంచి తట్టుకునేందుకు వెడల్పాటి టోపీలను ధరించి ప్రస్తుతం విధులు నిర్వర్తిస్తున్నారు. ఉన్నతాధికారులు అందించిన ప్రత్యేక టోపీలు ధరించి జీడిమెట్ల ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ముందు నరసాపూర్ రాష్ట్ర రహదారిపై విధులు నిర్వర్తిస్తుండగా 'సాక్షి'కెమెరా క్లిక్‌మనిపించింది.

విద్యుత్ స్తంభాలు ప్రమాద ఘంటికలు

రంగారెడ్డినగర్: విద్యుత్ స్తంభాలు ప్రమాద ఘంటికలను మోగిస్తున్నాయి. రంగారెడ్డినగర్ డివిజన్ గాంధీనగర్ పారిశ్రామికవాడలోని దినాలీ ఫుడ్స్ ప్రైవేట్ కంపెనీ ఎదుట ఉన్న విద్యుత్ ప్రమాదకరంగా మారింది. గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో స్తంభం కింది భాగం ఓ పక్కకు ఒంగిపోయింది. నిత్యం వందలాది మంది రాకపోకలు సాగించే ఈ రోడ్డు మార్గంలో స్తంభం ఎవరిపైనైనా కూలితే పెను ప్రమాదం జరిగే ఆస్కారముంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి స్తంభానికి మరమ్మతులు చేయించడం లేక కొత్త స్తంభాన్ని ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.


గాంధీనగర్ దీనాలి ఫుడ్స్ పరిశ్రమ ఎదుట ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభం

అగ్నిమాపక పరికరాలను అందుబాటులో ఉంచుకోవాలి


పోస్టర్ రిలీజ్ చేస్తున్న జీడిమెట్ల ఫైర్ ఆఫీసర్ సుభాష్‌రెడ్డి

జీడిమెట్ల: ప్రతి వాణిజ్య సముదాయంలో తప్పనిసరిగా అగ్నిప్రమాదాలను నిరోధించే పరికరాలను అందుబాటులో ఉంచుకోవాలని జీడిమెట్ల ఫైర్ ఇన్‌స్పెక్టర్ సుభాష్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభించిన డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ ఫైర్ సర్వీసెస్ శాఖ ఆధ్వర్యంలో ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించే వారోత్సవాలను సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా షాపూర్‌నగర్‌లోని రంగా, భుజంగా థియేటర్‌లో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా థియేటర్‌లో పనిచేస్తున్న సిబ్బందికి అగ్నిప్రమాదాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వారికి వివరించారు. అదే విధంగా థియేటర్‌లో అగ్నిప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను సిబ్బందికి వివరించారు.

ఈసారి వైభవంగా శ్రీరామ నవమి వేడుకలు

కుత్బుల్లాపూర్: శ్రీరామ నవమిని పురస్కరించుకొని ప్రతి ఏటా నిర్వహించే స్వామివారి కల్యాణం ఈ ఏడాది వైభవంగా నిర్వహించనున్నామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కుత్బుల్లాపూర్ పరిధి బ్యాంక్ కాలనీలోని సాయిబాబా దేవాలయం ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించనున్నారు. ఇప్పటికే పసుపు స్వయంగా దంచడంతో పాటు స్వామివారి తలంబ్రాల కోసం భక్తులు గోటితో వడ్లను వలుస్తున్నారు. ఈనెల 16వ తేదీన సీతారాముల విగ్రహాలకు అభిషేకం నిర్వహించనున్నారు.

◆ 17వ తేదీన ఉదయం 8గంటలకు స్వామి, అమ్మవార్లను సాయిబాబా ఆలయం నుంచి శ్రీ గణేశ్ మండపం వద్ద ఏర్పాటు చేసిన కల్యాణ వేదిక వద్దకు కోలాటం నృత్యాలు, మేళతాలాలతో తీసుకెళ్తారు. అక్కడే స్వామివారి కళ్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు.

◆ అనంతరం దాతలు సుజాత, బాబురావు దంపతుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు. అదే రోజు సాయంత్రం వేదిక వద్ద సామూహిక విష్ణు సహస్ర పారాయణం, హనుమాన్ చాలీసా, భక్తిగీతాలు ఉంటాయని అన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలన్నారు. ఇతర వివరాలు, కట్న కానుకలు అందించాలనే భక్తులు ఫోన్ నం. 9849112832, 9849533069లో సంప్రదించాలని కోరారు.